# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ హరిత విప్లవానికి మార్గదర్శకంగా మారాలని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ భారత పరిశ్రమల సమాఖ్యకు విజ్ఞప్తి చేశారు.

- ❖ పత్తి రైతులు, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మార్గాలను అన్వేషిస్తోందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

- ❖ నూతన సాంకేతిక ఆవిష్కరణలతో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ యువతకు పిలుపునిచ్చారు.

- ❖ దేశ సంస్కృతి, వారసత్వాల పరిరక్షణలో భాష కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు.

========================

అత్యంత విశ్వసనీయమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచే దిశగా భారతదేశం పురోగమిస్తోందని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన CII-ITC సుస్థిరత అవార్డుల ప్రదానోత్సవంలో ఉపరాష్ట్రపతి పాల్గొని మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులను ఎదుర్కొంటోందన్నారు. భారతదేశ స్థిరమైన అభివృద్ధికి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, అభివృద్ధి నమూనాకు భారత్ మార్గదర్శకంగా నిలుస్తోందని చెప్పారు. ప్రపంచ జనాభాలో 6వ వంతు కలిగిన భారత్.. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో నాల్గవ స్థానంలో ఉందన్నారు. పునరుత్పాదక ఇంధనాలు, గ్రీన్ హైడ్రోజన్, కార్బన్ మార్కెట్లలో పెట్టుబడి పెట్టడం ద్వారా హరిత విప్లవానికి మార్గదర్శకంగా మారాలని భారత పరిశ్రమల సమాఖ్యకు ఉపరాష్ట్రపతి విజ్ఞప్తి చేశారు.

========================

పత్తి రైతులు, నేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. కోయంబత్తూరులోని ICAR పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. వ్యవసాయానికి సంబంధించిన ప్రతి అంశంపైనా ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందన్నారు. ప్రధానంగా పత్తి పంట సాగులోని సమస్యలు, నేత కార్మికులు, వ్యవసాయ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మార్గాలను అన్వేషిస్తోందని పేర్కొన్నారు. పరిశోధన

కార్యకలాపాలకు ప్రోత్సాహకాలను అందిస్తూ.. విలువ ఆధారిత ఉత్పత్తుల సమస్యలను గుర్తిస్తున్నట్టు తెలిపారు. అధికారులు, పత్తి రైతుల మధ్య సమన్వయం, పరస్పర సహకారం.. పత్తి పరిశ్రమల ఆర్థిక పరిపుష్టికి దోహదపడతాయని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

(వాయిస్ 34 సెకన్లు)

========================

దేశ సంస్కృతి, వారసత్వాలను కాపాడుకోవడంలో భాష కీలక పాత్ర వహిస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లో జరిగిన రాజ్ భాష 'దక్షిణ సంవాద్' 50 సంవత్సరాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. హిందీ భాషను.. భారతదేశ భాషా వైవిధ్యాన్ని ఏకం చేసే ఒక తంతువుగా ఆయన అభివర్ణించారు. అధికారిక భాషా శాఖ ప్రయత్నాలను ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ప్రశంసిస్తూ... చైనా, జపాన్, ఇజ్రాయెల్ వంటి దేశాలు తమ మాతృభాషలకు ప్రాధాన్యత ఇస్తాయని చెప్పారు. జాతీయ ఐక్యతను బలోపేతం చేయడానికి పౌరులు రాజ్ భాషను స్వీకరించాలని కేంద్రమంత్రి విజ్ఞప్తి చేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

బయో సీఎన్‌జీ వంటి ఇంధనాల వినియోగం ద్వారా దేశ రవాణా ఖర్చులను గణనీయంగా తగ్గించవచ్చని కేంద్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ముంబైలో ఈరోజు జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతుల శ్రేయస్సుతో పాటు.. ఇంధన స్వాతంత్ర్యం సాధించడం, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో జీవ ఇంధనాల పాత్ర కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. వ్యర్థాలను సంపదగా మార్చడం ఆవశ్యకమన్న కేంద్రమంత్రి.. ప్రత్యామ్నాయ ఇంధనాల అవసరాన్ని ఉద్ఘాటించారు. మిథనాల్, ఇథనాల్, బయో-సీఎన్‌జీ వంటి ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించవలసి ఉందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో అనేక చెరువులను ఉచితంగా నిర్మించారని, వాటి కోసం తవ్విన మట్టిని రోడ్డు నిర్మాణంలో ఉపయోగించారని తెలిపారు. ఈ కార్యక్రమం ఈ ప్రాంతంలో నీటిపారుదల, మత్స్య సంపద అభివృద్ధికి దోహదపడిందన్నారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు “పీఎం రోజ్ గార్ మేళా”ను ప్రారంభించనున్నారు. అనంతరం ఆయన కొత్తగా ఉద్యోగ నియామక పత్రాలను పొందిన వారిని ఉద్దేశించి దృశ్య మాధ్యమం ద్వారా ప్రసంగించనున్నారు. కాగా.. గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్.. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల నూతన ఉద్యోగులకు నియామక పత్రాలను అందజేయనున్నారు.

========================

స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించామని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అన్నారు. ఈరోజు ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ.. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన ఆయుధాలను దేశీయంగానే తయారు చేస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ లోని వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాయన్నారు. అలాగే.. ఢిల్లీని లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ ప్రయోగించిన ఫతాహ్-11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు.. గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400 సహాయంతో మధ్యలోనే పేల్చివేశాయని చెప్పారు. ఖనిజాలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), క్వాంటమ్

కంప్యూటింగ్ వంటి వనరులను ఉపయోగించి సాంకేతికతలను కనిపెట్టడం ద్వారా 2047లో దేశాన్ని అభివృద్ధి చెందిన భారత్ గా తయారు చేయాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు.

(వాయిస్ 16 సెకన్లు)

========================

జనాభా సంబంధిత సవాళ్ళను అధిగమించేందుకు భారత్ కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె.పి. నడ్డా అన్నారు. ఈరోజు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని సామాజిక మాధ్యమం వేదికగా ఆయన ఒక పోస్ట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి... కుటుంబ నియంత్రణపై అవగాహన పెంచడానికి, సమస్యల పరిష్కారానికి ప్రపంచ జనాభా దినం ఒక వేదికగా పని చేస్తుందన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లతో పాటు, వివిధ ప్రజారోగ్య సౌకర్యాల ద్వారా ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కుటుంబ నియంత్రణ సేవలను అందిస్తోందని చెప్పారు. కుటుంబాలకు సాధికారత కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన భారతదేశ ఆవిర్భావానికి మార్గం సుగమం చేస్తోందని జేపీ నడ్డా తెలియజేశారు.

========================

ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఆర్థిక చెల్లింపులను భారత్ చేస్తోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) తెలిపింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) విధానాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా భారత్ ఈ ఘనత సాధించిందని పేర్కొంది. భారతదేశం డిజిటల్ చెల్లింపుల వేదికను మార్చివేసిందని, ఇంటర్ ఆపరబిలిటీ సౌకర్యం.. వినియోగదారుల డిజిటల్ చెల్లింపులలో సౌలభ్యాన్ని మెరుగుపరిచిందని, తద్వారా యూపీఐ వినియోగదారుల పరిధి మరింతగా విస్తరించిందని వివరించింది.

========================

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న మూడవ టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 5 వికెట్లతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ టీ విరామ సమయానికి ఒక వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 190 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 690 పాయింట్ల నష్టంతో 82 వేల 500 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 205 పాయింట్ల నష్టంతో 25 వేల 149 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.80 గా ఉంది. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధర 68.78 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3 వేల 352 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

========================

రానున్న నాలుగు రోజుల్లో దేశంలోని మధ్య, వాయువ్య ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు తెలిపారు. గడచిన 24 గంటల్లో హిమాచల్ ప్రదేశ్, దక్షిణ హర్యానా, తదితర ప్రాంతాల్లో 7 నుండి 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందని అధికారులు పేర్కొన్నారు.

========================
========================